# అభిమానాలు

శ్రీమతి నాయని కృష్ణకుమారి

"బావా!"

"ఊ!"

"ఇవ్వాళ నాకో ఉత్తరం వచ్చింది"

"ఊ!"

"ఎక్కడ నుంచని అడగవూ!"

"నే నడగడ మెందుకూ! చెప్పదలచుకున్నదానివి నువ్వే చెప్తావు!"

"పాపం! రమ్మన్నారు"

"మానేసెయ్ పోసీ."

లక్ష్మి ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఊరుకుని మళ్ళీ అందు కుంది.

"దొరగారికి రేపొస్తున్న ఒక పని!"

"ఏమిటో అది?"

"నాతో స్టేషనుకు రావడం!"

"ఆ! అదేపట్టింది నాకు ఆ రాసుకున్నవారెవరో, వాళ్ళు నీ ఆప్తులు కాబోలు!"

భర్త యిచ్చిన యీ జవాబును విన్నదో లేదో! ఆవిడ కళ్ళు కిటికీలోనుండి దూరంగా ప్రయాణం చేసి దూది మబ్బులకు నల్లరంగు పులుముతున్నట్లు ఏకాగ్రమైపోయి నయ్. ఉన్నట్లుండి మగతలో పడ్డట్లున్న భార్య ధోరణికి శ్రీధర్ విస్తుపోయాడు ఆవిడ ఎప్పుడూ అంతే! ఈ లోకంలో ఒక కాలూ పైలోకంలో ఒక కాలూ పెట్టి జీవిస్తున్నట్లుగా ఉంటుంది ఏదో విశిష్టతా, ప్రత్యేకతా పొంగి వచ్చేట్లు ఆమె అట్లా ఉంటే శ్రీధర్ ముగ్ధుడై పోయేవాడు. ఆ క్షణంలో, తనతో ఏకమై మధురిమలు కురిపించే తన లక్ష్మేనా ఈవిడ అనుకునేవాడు— భార్య మూకసమాధిని చెడగొట్టడం ఇష్టంలేక ఆవిడ కళ్ళకేసి చూస్తూ, ఆ చూపులు ప్రదర్శించినంతమేరా పోయి తిరిగి వస్తూ అవస్థ పడడం మొదలు పెట్టాడు.

"బావా!" మళ్ళీ పిలిచింది. వెంటనే జవాబుగా ఊ కొట్టి ఆతురతతో ఆవిడ చూపులలో చూపులు కలిపాడు.

"ప్రపంచం ఎంత అమాయకమైంది? అది పసి పిల్లతో సమానం కదూ!" ఈ మాటలు చెప్తున్న లక్ష్మి ముఖంలో వేయిమంది పసివాళ్ళ చిరునవ్వులశోభ చిందులు తొక్కింది. ఇంతసేపూ ఆమె దిక్కులకు కళ్ళు వప్పచెప్పి ప్రపంచాన్ని గురించి ఆలోచించాల్సిన అగత్య మేం కలిగిందో శ్రీధర్ కర్థం కాలేదు కాని అతని నాభి నుండి బయలుదేరిన హాసన తరంగమొకటి కెరటాలు కెరటాలుగా గొంతువరకూ కదిలి వచ్చి అక్కడ ఆగి పోగా, ముఖం చలించి అరుణమై, నవ్వును పుక్కిట పట్టి నట్లు కిలకల లాడింది

"ఏం, నవ్వుతావేం?"

"ఎంత అమాయకురాలివే నువ్వు! ప్రపంచం పసిపిల్ల, నువ్వు ఆరితేరిన ముత్తైదువువూ!"

"నిజం బావా! నా మాటల్లో ఇంతైనా అబద్ధంలేదు"

"పెద్ద పెద్దవాళ్ళంతా, అది కఠిన మైందనీ, ఆచరణ సాధ్యంకాని విధి నియమాలను అందరి నెత్తినా రుద్ది వేధిస్తుందనీ అంటారు దానికి దయా దాక్షిణ్యాలులేవు పరుల పచ్చ దానికి పనికి రాదు పురోగమనమూ, విప్లవాత్మక దృక్పథమూ అది సహించదు వాళ్ళూ వీళ్ళూ అనడ మెందుకు? ఆమాట నేనే అంటాను."

"ఎవరి అనుభవాలు వారివి! నా అనుభవమూ, తన్మూలంగా కలిగిన అభిప్రాయమూ వేరు"

"ఏమిటో నీ అనుభవం?"

"చెప్పాలా?"

"నీకిష్టం లేకపోతే దాచిపెట్టుకో! మధ్య నాకేం?"

"పోనీలే! రేపెవరొస్తున్నారో తెలుసా?"

మళ్ళీ గాలి యింకో దిక్కుకు తిరిగింది మనుష్యలలో ఉండే దుర్గుణమే యిది. ఒక అభిప్రాయాన్ని

పూర్తిగా వ్యక్తం చెయ్యడానికి శక్తి లేదని తెలిస్తే వెంటనే విషయాంతరాల్లోకి దిగడం పరిపాటి.

"రాణీగారి అనుగ్రహం కలగందే! నా కేమన్నా కర్ణపిశాచి ఉందనుకున్నావా!"

ఈ మాటలు లక్ష్మి వినిపించుకోలేదు ఇదుగో అంటూ ఒక ఉత్తరాన్ని భర్త ఒళ్ళోకి విసిరేసింది. ఆకదలికకు తల్లో జాజిపూలు కదిలి వాసనలు రేగి అతణ్ణి ముంచివేసినయ్ ఉత్తరం చేతుల మధ్యకు వచ్చింది అడ్రసు చూసి వ్రాత గుర్తు పట్టాడు—— ఇన్నాళ్ళకు తన తండ్రి వస్తున్నాడు శ్రీధర్ మనస్సులో ఆశ్చర్యం అలుముకుంది. కళ్ళు ఆలోచనలతో చలించి వెనుకటి స్మృతికోసం పాతరలాడినట్లు వ్యగ్రాలయినయ్ ఆ మగతలోకి పూల వాసన నడిచి తన దగ్గరకు వస్తున్నట్లు తోచింది చీరె రెప రెప, గాజుల గలల, కలలోలా అతణ్ణి ప్రబోధించింది తను ఊహాలు కట్టిపెట్టి వాస్తవ లోకంలోకి వచ్చేలోపుగా లక్ష్మి తన వీపుమీద వాలి చెవి దగ్గర జాజుల వాసనలను కుప్పలు పోస్తున్నది. ఆవిడ పొడుగాటి జడ తన గుండె మీద అటూ యిటూ కదుల్తూ నాట్యకత్తెలా లయలు పోయింది.

"ఏం బావా! ఆలోచనా?"

"ఛ! లేదే. ఏదీలేదు."

"ఊహూ! పనకు ఆలోచించడమే తెలీదు. నీ మనస్సులో ఊహ నాకు తెలియదా బావా!"

"చెప్పు చూద్దాం!"

"పందెంకట్టు! నీలో సగం మనస్సూ శరీరమూ పంచుకున్నదాన్ని—— నాతోనే?"

"నీతోనే! నువ్వు రాక్షసివి" పకపక నవ్వాడు శ్రీధర్. లక్ష్మికి ఆ నవ్వులో స్వర్గాన్ని మించిన అతిలోకత కన్పించింది

"ఆ వచ్చే ఆయన నీకేనా వ్రాయడం?"

"ఇంతలోనే ఉడుకుబోత్తనం?"

"మరి! నేను స్టేషనుకు రాకపోతే?"

"పోనీ ఉండిపో చూద్దాం!"

"ఛ! నీ కోసం వస్తారే! తోడు లేకుండా ఈ తురక రాజ్యంలో నిన్ను ఒంటరిగా పంపనా!"

ఇద్దరూ కిల కిల నవ్వుకున్నారు.

లక్ష్మి శ్రీధర్ లిద్దరూ జీవితంలో ఇంకా బాధ్యత లెరుగని నవదంపతులు. నిజానికి లక్ష్మి తెలివి గలది. ఎదుటి మనస్సును ఎరిగి ప్రవర్తించే మెలకువా, చొరవా ఆమె సొమ్ము. సోగతేలిన ముక్కూ, కళ్ళూ, ఆవిడ ముఖానికొక హోదాని తెచ్చిపెట్టేవి. చూచిన వాళ్ళంతా వాళ్ళిద్దరికీ ఈడూ జోడూ అనుకునేవారు.

౨

బండి అల్లంత దూరాన రణగణధ్వని చేస్తూ గర్భ భరాలసలా కదిలి వస్తున్నది. పువ్వులు, పండ్లు, వివిధ వస్తువులూ అమ్మేవాళ్ళ కేకలూ, పెద్దవాళ్ళ తొందరా, పసిపిల్లల కీచు గొంతులూ, వీటన్నిటితో అది మరొక లోకపు విషయంలా అనిపించింది. బండి ఇంకా ఆగలేదు.

"బావా!" ఆతురతగా హెచ్చరించింది లక్ష్మి. పోయి పెట్టి పెట్టీ, మనిషి మనిషీ పరిశీలించి చూడాలన్న తొందర ఆవిడలో ఉన్ముఖంగా ఉంది. శ్రీధర్ ఏదో ఆలోచనలో పడి, రాబోయే సంఘటన నెదుర్కొనే వ్యగ్రతతో పరాకుగా ఉన్నాడు. అది చూచి, కసిగొన్న పసిపిల్లలా భర్త కళ్ళు దొరక బుచ్చుకుని చిత్తజల్లులా ముందుకు అడుగు వేసింది.

"అబ్బ! ఏమిటీ?"

"నా మొహం! ఇక్కడ కొచ్చింది పరాకు చిత్తగించడానికి కాదండీ లాయరుగారూ! బండి వచ్చింది!"

భార్యమాటలకు తొందరపడి ముందుకు నడిచాడు ఎక్కడో పెట్టిలోనుండి ఒక జత కళ్లు వీళ్ళను చూస్తూ, చెయ్యి ఊపడం గమనించాడు.

"అరుగో!" మాట పూర్తి కాకముందే పరుగులు పెట్టింది శ్రీధర్ బిడియపడుతున్నట్లు లేని గంభీరత తెచ్చుకుంటూ, అవస్థ పడుతూ భార్య ననుసరించాడు.

కూలివాడు సామాను కిందికి చేరవేస్తున్నాడు శ్రీధర్ మారు మాట లేకుండా తండ్రి ముఖం చూస్తూ, పాత

గాధలు తవ్వి పోసుకుంటున్నాడు లక్ష్మి పసిపిల్లకు మల్లే ఆయనతో కబుర్లు మొదలుపెట్టింది

సామానంతా జట్కాలోకి చేరింది బండి కదిలింది గుఱ్ఱపు డెక్కల చప్పుడు లోకవృత్తాంతంతో లయవేస్తూ, ప్రజలను శాసించి, అదుపులో పెట్టుకుంటున్నట్లు టక టక లాడింది

"ఎట్లా ఉంగమ్మా మీ సంసారం" — మామగారి ప్రశ్నకు లక్ష్మి లజ్జా మధురంగా నవ్వి బండి కప్పుమీద బిగించిన వెదురు బద్దలు చూడడం మొదలు పెట్టింది

"పిల్లలూ, యిల్లూ, వదలివస్తే ఆసరా ఏదీ! నాకైనా మిమ్మల్ని చూడడానికెన్నాళ్ళకు తీరిక చిక్కింది" రాఘవయ్యగారీ మాటలంటుంటేనే ఆయన ముఖంలో రంగులు మారుతున్నయ్ అబద్ధాన్ని నిజంలా అతికేట్లు చేస్తే చెప్పవచ్చు కాని ఆ చెప్పడం వల్ల లోపల కలిగే కలకలం అణచుకోవడం ఎవరి తరం"

ఒక్క క్షణం తనలో తానే కలవరపడి ఆయన సర్దుకున్నారు మళ్ళీ ఏమీ మాట్లాడకుండా బండి నుంచి జరిగి దూరంగా వెనక్కు పోతున్న ప్రపంచాన్ని చూడసాగారు

బండి ఆగింది బండివాడు సామాను చేరవేశాడు లక్ష్మి చకచక ఇంట్లోకి నడిచి మామగారికి దారి చూపించింది తన పెండ్లయిన రెండేండ్లకు, ఆయన రావడమిదే మొదటి సారి ఆయనకు ఈ యిల్లు ఈ వాతావరణం, ఇవన్నీ నచ్చుతవో లేదో అని ఆలోచించడం మొదలు పెట్టింది

ఆయన మనస్సులో ఎన్నెన్నో ఊహలు చిత్రవిచిత్రాకృతులు తాల్చి తెరమీద బొమ్మలకు మల్లే ప్రవేశ నిష్క్రమణలు చేస్తున్నయ్ ఆ లోపల జరిగే అంతర్యుద్ధానికి కారకులెవరో, కారణాలేమిటో ఆ ముగ్గురికీ స్ఫుటంగా తెలియదు, కాని ఎవరికి వారే తామే దానికి బాధ్యులమనే మొదలు పెట్టారు

తండ్రీ కొడుకుల మధ్య ఏదో ఒక అఘాతం ఉండేదనీ, అది పూర్తిగా పూడు పట్టి పోయిందనీ చూచేవారికి తెలియకపోవచ్చు ఒకరి మీద ఒకరికి విచిత్రాభిప్రాయాలూ, కొంతవరకూ అప్రసన్నమైన ఊహలూ ఒకప్పుడు హృదయాన్ని గాయంచేసి యీకాలానికి పూర్తిగా మానిపోయినా మచ్చలు మాత్రం చెరిగలేదు.

"స్నానం చెయ్యరూ! నీళ్ళు సిద్ధంగా ఉన్నయ్"

"వస్తున్నానమ్మా! మీ స్నాన సంధ్యలు పొద్దుటే అయినయ్ కాబోలు!"

"నావి మాత్రం! వారు తిరిగొచ్చి చేస్తానన్నారు!" — ఈ జవాబు రాఘవయ్యగారు విన్నారో లేదో గాని శ్రీధర్ మాత్రం విని వింతగా భార్యవైపు చూడడం మొదలు పెట్టాడు

ఏం అట్లా చూసావన్నట్లు కళ్ళతో బెదర గొట్టింది లక్ష్మి రాఘవయ్యగారు తువ్వాలు మీద వేసుకు వెళ్ళగానే శ్రీధర్ దూకుడుగా భార్య దగ్గరికి వచ్చాడు.

"నీకు లక్షసార్లు చెప్పాను!"

"ఏమిటి! ఇంకోసారి కూడా చెప్పూ!"

"ప్రపంచానికంత భయపడతావేం లక్ష్మీ!"

"నేనా! ఛ! దాన్ని చూస్తే నాకు జాలి బావా! ఇందాకే చెప్పానే, అదుత్త అమాయకపుది"

"చాల్లే! నాన్న ఉన్నారని, ఆయనేమన్నా అనుకుంటారని."

"ఆ! ఆయనేమన్నా అనుకుంటారని, ఆయన దృష్టిలో నేను చెడ్డదాన్ని కాకూడదని, నీవు నీవనే నిన్ను వారు అన్నాను. బహువచన ప్రయోగం చేశాను అదేనా?"

తనేదో పెద్ద దాడి తీద్దామని నాటకీయంగా మొదలు పెట్టిన విషయాన్ని గ్రహించి సామాన్య విషయంలా తెల గొట్టేటప్పటికి శ్రీధర్ చల్లబడి పోయాడు

"అసలీ ఒక్క విషయంలోనే కాదు నా ప్రతిఘటన. నీవు ప్రతీదీ అంతే నీ మనస్సుకు ఇష్టమైందాన్ని ఎందుకు నిర్లక్ష్యం చెయ్యడం ప్రపంచం అనుకుంటే అనుకోనీ లెక్కేమిటీ?"

"ఈ లెక్క చెయ్యడం నా దృష్టిలో ఇంకో విధంగా పిల్ల దేనికన్నా మొండికి పేసి ఘారాం పెడితే ఏం చేస్తుంది తల్లి? అది మూర్ఖతే అవనీ, అడిగింది సమకూర్చి ఆనందింప చేస్తుంది కదా! ప్రపంచమంతా పసిపిల్లలాటి

దన్నదిందుకే. దాని ఊహలూ, కట్టుబాట్లూ, ఆచరణ నియమాలూ, అన్నీ పసివాళ్ళ మూర్ఖతను పుంజుకున్న అప్రముఖ విషయాలుగా కనిపిస్తయ్ వాటిని కాదని దాని హృదయం గాయం చెయ్యడం నాకిష్టం లేదు అందులో కొన్ని యిష్టం లేకపోయినా ఆచరించినందువల్ల వచ్చే నష్టమూ లేదు "

దీనికి శ్రీధరేమీ జవాబివ్వలేదు

విభిన్న మనస్తత్వాలు విభిన్న దృక్పథాలలో ఆలోచిస్తయ్ అట్లానే పరిస్థితుల్ని అవగాహన చేసుకుని వేరు వేరు రూపాల్ని చిత్రించుకుంటయ్ ఎవరిని కాదన డానికెవరికి హక్కుంది ? లక్ష్మి తన భార్యే ఆవిడమీద తనకు పూర్వాధికారముంది అంతమాత్రాన ఆవిడ మనస్సునూ దాని ఆలోచనావిధానాన్నీ తన దారిలో పూర్తిగా మలుచుకో లేడు

''ఏమండీ లాయరుగారూ ! స్నానానికి వేంచేయండి ! మామయ్య వస్తున్నట్లున్నారు," శ్రీధర్ చెవి దగ్గర గాలి గుస గుస లాడింది. చూస్తే లక్ష్మి అతని చెవి దగ్గర ముఖం చేర్చాలని మునివేళ్ళమీద లేచి తంటాలు పడుతున్నది. ఆలోచనా ప్రవాహం నుంచి విడి వడి భార్య అవస్థ చూచి చిరునవ్వులు కుప్పలు పోశాడు శ్రీధర్.

భోజనాల బల్ల దగ్గర లక్ష్మి అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నది వంటలక్క అందించేవి అందించి అమర్చి పెడుతున్నా సంభ్రమమూ ఆతురతా ఆవిడలో పుంజీభవించి, కాలు నిలవనివ్వలేదు

కంచంలో కుప్పపోసిన అన్నాన్ని కొంత ముందుకు లాగాడు శ్రీధర్ లక్ష్మి మామగారికి నెయ్యి వేసి భర్త దగ్గరకు వచ్చి గిన్నె ఎత్తింది ముఖం చూస్తూ

శ్రీధర్‌కుపితంగా, రూక్షంగా ''నీకంటే సుబ్బులు వాగానే వడ్డిస్తుంది''' అన్నాడు అయితే అన్నట్లు ప్రశ్నార్థకంగా చూచింది

"నా టైమ్ తప్పంటుంది మీ వాచీలో ఎంత యింది నాన్నా !'' తండ్రిని ప్రశ్నించాడు.

''పన్నెండు దాటింది' అవునమ్మా నీవు కూర్చో, వంట మనిషి అందిస్తుందిగా !'' మామగారి గొంతు తేనె సోనలా ప్రవహించింది. అదేదీ వినిపించుకోనట్లు భర్త కంచంలో నెయ్యి గుమ్మరించి గబ గబ అడుగులు వేస్తూ వంటింట్లోకి నడిచింది లక్ష్మి— తండ్రీ కొడుకులు ముఖాలు చూచుకున్నారు—

లక్ష్మి ప్రతి చర్యలో, సరోజినిని చూచే రాఘవయ్యగారి మనస్సు చలించిపోయింది సరోజిని ఆయన కూతురు పుట్టిల్లు వదిలి అత్తగారి సొమ్మయిపోయిన ఒక్కగా నొక్క కూతురు!

రాఘవయ్యగారిది నలభై యేండ్లు దాటిన వయస్సు. బక్క పలచగా, రివటలా, నల్లగా ఉండే ఆయన పొట్టి కిందే లెఖ్ఖ సంతోషం కలిగినా కష్టం వచ్చినా, మరి మిన్ను విరిగి మీద పడ్డా, ఒకటే తీక్షణతతో గూడిన గాంభీర్యం మాత్రమే ఆయన ముఖంలో కనపడుతుంది ఆయన్ని చూడగానే మాటకారి కాదనీ, లోకానికి దూరంగా ఉండే వ్యక్తనీ అందరూ గ్రహించగలరు ఆయన ఎవరితోనైనా కలుపు గోలుగా ఉండగలరో లేదో ప్రయత్నించి చూడకుండానే, ముక్తసరి మనిషని ఆయన్ను తెలిసిన వాళ్ళనుకోవడం పరిపాటైపోయింది- వాళ్ళదేమీ సంపన్న కుటుంబం కాదు. జీతపు రాళ్ళమీద ఆధారపడే, ఆయన భార్యా బిడ్డలకు లోటు లేకుండా కాచుకువచ్చేవారు.

పెద్ద కొడుకు శ్రీధర్ బియ్యే పరీక్షకాగానే తండ్రి దగ్గరకు వచ్చి లా చదవాలనుకున్న తన అభిలాషను తెలియజేశాడు. ఆయనకిది నచ్చలేదు ఒక డిగ్రీ సంపాదించగానే కొడుకు తన చేతికి ఆసరాగావచ్చి తన కష్టాల్ని పంచుకోవాలనుకుంటుంటే యింకా చదువా? సగం వయస్సు పైనపడుతున్న తానొక్కడే ఈ సంసారాన్నెంత కాలం ఈదాలి? అయినా తన అభిప్రాయాల్ని ఆయన సూటిగా కొడుక్కి చెప్పలేదు అందుకు అభిమానం అడ్డు వచ్చింది. ముభావంగా, తటస్థంగా ఊరుకున్నాడు కాని కొడుకంటే అప్రసన్నత హృదయంలో సెల వేసింది. శ్రీధర్ రెండేళ్ళలో న్యాయశాస్త్ర పట్టభద్రు డయ్యాడు.

ఈ రెండు సంవత్సరాలలో జరిగిన సంగతులు రామాయణ భారతాలంటివి శ్రీధర్ మనస్సులో మన్మథుడు పదవళ్ళు త్రొక్కాడు లక్ష్మి వాళ్ళ చుట్టాల పిల్ల. ఒకవిధంగా దూరం కాని మరదలు వరస ఆవిడలో ఏం చూచాడో తన మనస్సామెకు అంకితం చేశాననుకున్నాడు ఆమె మాటలో, కదలిక, చేష్టలో తన మనస్సునకాహ్లాదం కలిగించే తీరు చూచి పొంగిపోయాడు—

# అభిమానాలు

అప్పటికి సరోజినికింకా పెండ్లి కాలేదు. ఆమెకు వివాహం చేసి పంపే బాధ్యత తండ్రిది. సరోజిని అందకత్తె కాకపోయినా కురూపి కాదు వినయవతి, గుణవతీ అయినా. కాలం ఆడపిల్లల గుణగణాలను చూడదు. అవిడ తెచ్చే సంపల్ని చూస్తుంది— సంపన్నుడుకాని రాఘవయ్యగారు మొదట తొక్కిసలాడారు కాని గుండెల్లో కొడుకును చూచుకున్న ధైర్యముండేది ఒకరి పెండ్లి కొకరు పూచీ శ్రీధర్ అన్నగా ఆమాత్రం బాధ్యత నెరవేర్చడా అనుకున్నారు

ఎక్కడో ఒక సంబంధం వచ్చింది. చదువుతున్న అన్నా చెల్లెళ్ళు కుండమార్పిళ్ళకు తటస్థపడారు ఈ వార్త తెలియగానే రాఘవయ్యగారి ఆనందానికి మేరలేదు పెండ్లయినంత సంబరపడి కొడుకును పిలిచి చెప్పారాయన శ్రీధర్ చలించకుండా, "అమ్మాయి పెండ్లిలో నా పెండ్లి ముడిపెట్టకండి నాన్నా ముందు దానికి చేసేయండి! నా కివేమీ నచ్చవు!" అని నిక్కచ్చిగా చెప్పేసరికి రాఘవయ్యగారి నడుము విరిగినట్లయింది.

బాధ్యతలేని పసివాడు పిల్లపెళ్ళి చేసేయమని ఎంత తేలిగ్గా చెప్పాడు ఆడపిల్ల పెళ్ళి తనన్నంత తేలిగ్గా జరుగుతుందా! కొడుకు అంటీ పట్టని తనం చూచి ఆయన మనస్సు ఘోషించింది యువకుల ఆశయమంతా పెద్దలను ధిక్కరించాలనే ఒని తీర్మానించుకున్నాడు. "వృద్ధత్వపుతెర మీదికి జారుతున్నకొద్దీ అందరూ ఇంతే యువకుల హృదయమూ కోరికలూ గణించరు వయస్సులో ఎంత అంతర మున్నా ఎవరి ఊహలూ, అనుభవాలూ వారికే అని గ్రహించరెందుకో?'' అని శ్రీధర్ మథనపడ్డాడు తండ్రీ కొడుకుల మధ్య ఇదివరకు నడిచే ముక్త సంభాషణ కూడా కట్టుబడిపోయింది

సరోజినికి పెండ్లయిపోయింది రాఘవయ్యగారు మూడు సంచులు గుమ్మరించారు. శ్రీధర్ కట్నం తీసుకోకుండానే లక్ష్మిని చేసుకున్నాడు

కొడుకు పెళ్ళి తన యిష్టంమీద చేసినట్లే చేసినా ఆ కొడుకూ కోడలూ ఆయన హృదయంలో ఒక రకపు ఉపేక్షకు గురికాక తప్పలేదు.

ఉద్యోగరీత్యా తండ్రికి దూరమైన శ్రీధర్ మనస్సులో తండ్రి ధ్యాసే లేదు ఆయనకు తన మీద ప్రేమలేదనీ, తనాయనకు పగవాడనీ నిర్లక్ష్యంచేవాడు—

రాఘవయ్యగారికి మాత్రం కొడుకు దూరం కాగానే పితృవాత్సల్యం ప్రవర్ధమానం కోసాగింది అది పొంగి పొరలడానికి రెండు సంవత్సరాల కాలం కావలసివచ్చింది ఆ కొడుకు గాని కోడలు గాని చేసిన తప్పేమిటి? తన పెద్దరికం సర్వతోముఖంగా చెల్లాలనీ, వాళ్ళ యువకత్వపు హక్కులకు భంగం కలిగించి నొప్పించానేమోనని ఆలోచించారు పుట్టిల్లు వదలిన సరోజిని రూపం లక్ష్మిలో కలకల నవ్వినట్లాయన గుండెలకు తట్టింది

''అన్నం సరిగా తింటున్నట్లు లేదు. పెట్టింది కొంచమూ, తరగందే?'' ఎదురు గుండా తన్ను నిరతంగా హృదయపు మారుమూలల్ని సైతం గాలించే చూపుల్తో మధురంగా మందలించింది లక్ష్మి ఆయన ఒక్కసారిగా వాస్తవ ప్రపంచంలోకి వచ్చి, ఆ చూపులకు తట్టుకోలేక తత్తరపడుతూ,

"ఏమిటమ్మా అనేది? నే నన్నం తినటంలేదనా? ఈ కాలపు పిల్లలే యింత ఎప్పుడూ పెద్దవాళ్ళ తప్పులు బాగా చూపిస్తారు!" అని అతకని నవ్వు నవ్వుతూ గబ గబ అనేశారు

ఆమాట చుట్టలు చుట్టుకుంటూ వచ్చి శ్రీధర్ చెవుల్లో స్పందించింది.

ఆయన తండ్రి వైపు చూచిన చూపులో పూర్వస్మృతులు కెలక వేసిన బాధాతీవ్రత సుడులు తిరిగింది— రాఘవయ్యగారి మనస్సులో పుత్రప్రేమకు చెలియలికట్ట కనిపించలేదు

★

పాపం— రాజాజీ తమకు గల దేవతాప్రసన్నతను సకాలములో గుర్తించుకోలేకపోయారు. వర్షం కావాలని చేయెత్తి మ్రొక్కినంత మాత్రాన, తన అభిమాన పాత్రమగు దక్షిణాదిని, ఇంక ఒద్దురా నాయనా అన్నంతవరకు, నీటిలో ముంచితేల్చిన దేవతలు, పరకాయప్రవేశము చేసి, ఖోస్లా ప్రముఖులు కృష్ణా— పెన్నారును సమర్థించునట్లు చేయకపోదురా? సకాలంలో ముఖ్యమంత్రికి ఏదో కొంచం ఏమరుపాటు కల్గింది.

—నాస్తికశిఖామణి.